క్లుప్తంగా

ఆలీనగర్‌లో డ్రెయిన్స్ నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు శివారు ఆలీనగర్‌లో సీసీ డ్రెయిన్స్ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.9లక్షలతో నిర్మాణం చేయనున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రెయిన్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా సీతమ్మ, వార్డు సభ్యులు రావూరి రవిబాబు, షేక్ బాషా, మహమ్మద్ అన్సారి, షేక్ జబీర్, అబ్దుల్ సలామ్, షేక్ షరీద్, షేక్ నసీమ్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 100 మందికి పరీక్షలు



తెనాలి: పట్టణంలోని హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆ బ్యాంకు దేవీ చౌక్ శాఖలో ఏర్పాటైన శిబిరంలో 100 మందికి కంటి, బీపీ, మధుమేహం పరీక్షలు చేశారు. అవసరమైన వైద్య సలహాల్ని ఇచ్చారు. కంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, దేవీచౌక్ శాఖ మేనేజరు సి.రవిరత్నాకర్ హాజరయ్యారు. హాస్పటల్ సీఈవో గిరిబాబు పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు అంబరీషుడుకు సన్మానం



అంబరీషుడు దంపతులు, రాజారెడ్డిని సత్కరిస్తున్న ఖలేదా నసీమ్ తదితరులు

తెనాలి: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్ని ఉత్తమంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ సూచించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఇటీవల కలెక్టర్ నుంచి అందుకున్న పాఠశాల కొగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఎనికపల్లి అంబరీషుడు అభినందనసభను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు ప్రధానోపాధ్యాయుడు కప్పల రాజారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఖలేదా నసీమ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై ప్రత్యేకంగా దృష్టిసారించి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నట్టు గుర్తు చేశారు. ఉపాధ్యాయుడు ఎనికపల్లి అంబరీషుడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందడం స్ఫూర్తిదాయకంగా చెప్పారు. మండల విద్యాశాఖాధికారి జయంతిబాబు మాట్లాడుతూ జిల్లాస్థాయి అవార్డును స్వీకరించిన అంబరీషుడు సేవల్ని అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలతో విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సభానంతరం అంబరీషుడు-సతీ సుమతి దంపతుల్ని ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై ఓ దినపత్రిక నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ప్రధానోపాధ్యాయుడు కప్పల రాజారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ అపర్ణ స్వాతి, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి పద్మజ, కోశాధికారి రామయ్య, రమేష్, డి.శ్రీనివాసరావు, హేమలత, శైలజ, బోసు పాల్గొన్నారు.

శ్రీ సుదర్శన మహా హోమం ప్రారంభం



తెనాలి టౌన్: షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారి పవిత్రోత్సవం, మహా సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయంలో ఉదయం అష్టోత్తర శత కళశాభిషేకం, పూర్ణాహుతి జరిపారు. సాయంత్రం అంకురార్పణతో శ్రీ సుదర్శన మహా హోమాన్ని ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు హోమాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసారెడ్డి, అర్చకులు ఆర్.కిరణ్‌కుమార్, సురేష్, సంకీర్తన బృందం అధ్యక్షులు మూర్తి అనురాధ, సేవా సమితి సెక్రటరీ మూర్తి వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య రక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

- ప్రతి కుటుంబానికీ వర్తించాలి
- నేటి నుంచి ఇంటింటా సర్వేకు శ్రీకారం
- ఈనెల 30 నుంచి మెగా వైద్య శిబిరాలు
- సమష్టి కృషితో నూరు శాతం విజయవంతం చేయాలి
- సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పది గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, ఆరోగ్య కార్యదర్శులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో వి.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శనివారం నుంచి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేయాలని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహించే ఎనిమిది రకాల వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ గురించి ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. గతంలో జగనన్న సురక్ష అమలులో జిల్లాలోనే తెనాలి నియోజక వర్గానికి మంచి పేరొచ్చిందని, ఇప్పుడు కూడా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి ఒక్కరికీ చేరేలా చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి గ్రామంలో ఈనెల 29వరకు క్షేత్రస్థాయిలో వలంటీర్లతో సర్వే చేయించి, 30న నుంచి మండలంలో సచివాలయాల వారీగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయనున్నట్లు వెల్లడించారు. దీర్ఘకాలిక జబ్బులున్న వారిని జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసి మంచి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ ప్రియాంక, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

తెనాలి టౌన్: రూరల్ మండలం కఠెవరంలో శుక్రవారం జగనన్న సురక్షపై వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో జగనన్న సురక్ష అయిదు దశల్లో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవాలని చెప్పారు. దీర్ఘకాలిక రోగులు, బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమం జరిగే రోజు గ్రామంలో వైద్యులు రోగులకు పరీక్షలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

స్వచ్ఛతపై మున్సిపల్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



తెనాలి: స్వచ్ఛతా పక్వాడ్ రెండు వారాల కార్యక్రమంలో ఆఖరి రోజైన శుక్రవారం స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గాంధీ చౌక్‌లో 'నూకడ్ నాటక్' ప్రదర్శించారు. ప్లకార్డులు, ప్రదర్శనలతో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. శుభ్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, ఆనందం, నీటి పొదుపు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నివారణ, తడి చెత్త, పొడి చెత్త విభజనతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులకు సానుభూతితో సహాయకులుగా ఉండాలని తమ ప్రదర్శనలతో చాటారు. పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ శిక్షణతో ప్రదర్శించిన ఈ కార్యక్రమాన్ని రాజకిశోర్ పర్యవేక్షించారు. స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమాల్లో విజేతలకు శనివారం బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

రేపు కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

- 2022-23లో రూ.2.50 కోట్ల నికరలాభం
- చైర్మన్ డీఎల్ కాంతారావు వెల్లడి



మాట్లాడుతున్న డీఎల్ కాంతారావు

తెనాలి: కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ, తెనాలి 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.2.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు చైర్మన్ దావులూరి లక్ష్మీ కాంతారావు వెల్లడించారు. సొసైటీ షేర్ కాపిటల్ 1.96 కోట్లు, డిపాజిట్లు రూ.102.24 కోట్లు ఉండగా బంగారు ఆభరణాలు, స్థిరాస్తులపై రూ.97.87 కోట్ల రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. స్థానిక కొత్తపేటలోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దావులూరి సోమశేఖరరావుతో 2001లో రెండు శాఖలతో ఆరంభమైన సొసైటీ, ఇప్పుడు తన హయాంలో తొమ్మిది శాఖలు నడుస్తున్నాయని తెలిపారు. తెనాలితోపాటు, కొల్లూరు, కొల్లిపర, గుంటూరు శాఖలు సొంత భవనాల్లో ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం పట్టణంలోని సొంత భవనంపై రెండో అంతస్తు నిర్మాణం జరుగుతోందని చెప్పారు. బంగారు ఆభరణాలపై 11.5 శాతం, స్థిరాస్తులపై 15 శాతం వడ్డీకి రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. సొసైటీ 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఈనెల 17న తెనాలి ఎన్జీవో కల్యాణమండపంలో జరుగుతుందని, సభ్యులంతా హాజరుకావాలని కోరారు. సమావేశం అనంతరం శ్రీవెంకటలక్ష్మి దుర్గ నాట్య మండలి, తెనాలి వారి 'దేవ నర్తకి' పద్య నాటకం ఉంటుందని వివరించారు.

ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైస్ చైర్మన్ హరిప్రసాద్, డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

తెనాలి అర్బన్: ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరి ప్రసాద్ పేర్కొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో చినరావూరు పార్కులో శుక్రవారం దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం దోమకాటు వల్ల వచ్చే వ్యాధులకు సంబంధించిన కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ దోమకాటు వలన విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వాకర్స్‌కు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, తెనాలి సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, హర్టికల్చరల్ అధికారి శేషుబాబు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు

తెనాలి అర్బన్: ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు సూచించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవ సంస్థ ఆధ్వర్యంలో చినరావూరుతోటలోని ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో అవగాహన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలిలో రెండు కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, సురక్ష యోజన, జీవన్‌జ్యోతి యోజన, ఈ-శ్రమ్ కార్డు, అభయ కార్డు వంటి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

తెనాలి రూరల్: బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన తెనాలి సుల్తానాబాద్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. సుల్తానాబాద్‌కు చెందిన 50 ఏళ్ల జబర్‌లాల్ నాయక్ బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్యశాలకు తరలించారు. జబర్‌లాల్ నాయక్ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ



25వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ రామయ్య



10వ వార్డులో పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సామ్రాజ్యం

తెనాలి అర్బన్: నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకను పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పంపిణీ చేశారు. 10వ వార్డులో 30 పింఛన్లను కౌన్సిలర్ తిరుమలశెట్టి సామ్రాజ్యం, 25వ వార్డులో 12 పింఛన్లను కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య అందించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వీడియోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు

తెనాలి అర్బన్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీడియోగ్రాఫర్ మల్లెల వెంకట్ కుటుంబ సభ్యుల్ని తెనాలి వీడియోగ్రాఫర్స్ అండ్ ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం బుర్రిపాలెంలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అసోసియేషన్ తరఫున వెంకట్ తండ్రి విల్సన్‌కు రూ.86వేలను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకట్ మృతి చెందడం బాధాకరమని తెలిపారు. అసోసియేషన్ తరఫున కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి ఫ్రాంక్లింగ్, తోట శ్రీనివాసరావు, సభ్యులు నాగరాజు, సాంబయ్య, చైతన్య, ఎన్ఆర్‌టీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవిత్ర 'పర్వ పర్యూషన్' దినాలు ప్రారంభం

- జైనులకు ముఖ్యమైన పండుగ
- తెనాలి గంగానమ్మపేటలోని ప్రాచీన జైన ఆలయంలో వేడుకలు



జైన దేవాలయంలో స్వామి విగ్రహాలు

తెనాలి: అహింసను పరమ ధర్మంగా భావించేవారు జైనులు. బతుకు...బతకనివ్వు అనే నినాదంతో ముందుకు సాగే జైనులకు పర్వ పర్యూషన్ ఒక పెద్ద పండుగ. మంగళవారం నుంచి ఆరంభమైంది. తొలి రోజున గంగానమ్మపేటలోని ప్రాచీన జైన దేవాలయంలో స్వామి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. ఈనెల 19 వరకు ఎనిమిదిరోజుల పాటు పర్యూషన్ పర్వదినాల్ని అత్యంత పవిత్రంగా జరుపుకుంటారు. ఆ విశేషాలివి.

కాచి చల్లార్చిన నీళ్లతో ఉపవాసం

తొలిరోజున సూర్యుడు ఉదయించిన 45 నిమిషాల తర్వాత కాచి చల్లార్చిన నీళ్లు తాగి మరుసటి రోజు వరకు పూర్తి ఉపవాసం చేస్తారు. తిరిగి రెండో రోజు నీళ్లు తాగి ఉపవాసం చేయడాన్ని 'తేళ్లా' అని, ఎనిమిది రోజులు చేయడాన్ని 'అట్టయ్'గా పిలుచుకుంటారు. పర్యూషన్ ఉపవాస దినాల్లో భాగంగా మూడో రోజు తమ ముఖ్య గ్రంథమైన కల్పసూత్ర పారాయణం చేస్తారు. అయిదో రోజు భగవాన్ మహావీర్‌స్వామికి పవళింపుసేవ నిర్వహిస్తారు. స్వామిని మననం చేసుకుంటూ ఆయనకు వచ్చిన పధ్నాలుగు స్వప్నాల గురించి పఠనం చేస్తారు. పర్యూషన్‌లో భాగంగా పవిత్ర గ్రంథం కల్పసూత్రపై వేలం పాటు నిర్వహిస్తారు. ఎక్కువ మొత్తానికి దక్కించుకున్న వారి ఇంటికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ పఠనం చేస్తారు. దీనిని జైనులు అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తారు. పాలితణా, సమ్మిత శిఖరజి, శంఖేశ్వర పవిత్రస్థలాల ప్రాముఖ్యతను అక్కడకు వెళ్లివచ్చిన వారు వివరిస్తారు. చివరిరోజు సమర్పణ దినంగా భావిస్తారు. ఆలయానికి వెళ్లి స్వామికి పూజలు నిర్వహించిన తర్వాత బంధువుల గృహాలకు వెళతారు. గడిచిన 365 రోజుల్లో తెలియక ఏదైనా తప్పు చేసి ఉంటే క్షమించమని కోరతారు.

తీర్థంకరుల ఆరాధన

జైన తీర్థంకరుల్ని వీరు పూజిస్తారు. రెండున్నర వేల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన జైన మతంలో 24 మంది తీర్థంకరులు ఉన్నారు. వీరిలో మొదటి వారు రిషబ్‌దేవ్ భగవాన్ కాగా, వర్ధమాన మహావీరుడు 24వ తీర్థకరుడు. ప్రాపంచిక సుఖ, సంపదల్ని విడిచి, సన్యసించి, ఇంద్రియాల్ని జయించి, ఘోర తపస్సుతో కైవల్య జ్ఞానం పొందిన వారే తీర్థంకరులు. జైన మతం అహింసకే ప్రాధాన్యత నిస్తుంది. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో జైన దేవాలయాలున్నాయి. 75 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన తెనాలి గంగానమ్మపేటలోని మహావీర్ ఆలయం పాలరాతితోనూ, అద్దాల అలంకరణతోనూ విశేషంగా ఆకర్షిస్తుంటుంది. దేవాలయంలోని చింతామణి విశ్వనాథ్, కుంతునాథ్‌ల సమేత వాసపూజ్య స్వామిని రోజుకో విధంగా అలంకరిస్తారు. జీవహింస మహాపాపం అనే విశ్వాసంతో అత్యంత భక్తిశ్రద్ధలతో పర్యూషన్ పవిత్ర దినాల్ని జరుపుకునే జైనులు, మరోవారం తర్వాత గోశాలకు వెళ్లి గోవులకు అహారం అందజేసి అక్కడ పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రజలకు మిఠాయిలు పంచిపెడతారు.

నటుడు మిక్కిలినేనికి ఘన నివాళి



మాట్లాడుతున్న అరసం నాయకుడు బెనహర్

తెనాలి అర్బన్: చలన చిత్ర నటుడు డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అరసం నాయకులు కనపర్తి బెనహర్ సూచించారు. అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి తెనాలి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్‌లోని ఇస్కాఫ్ కార్యాలయంలో అమర కళాకారుల సంస్మరణ సభను నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెనహర్ మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ద్వారా పేద ప్రజల కష్టాల్ని తీర్చేందుకు కృషి చేసి వ్యక్తి రాధాకృష్ణమూర్తి అని కొనియాడారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నాయకులు దేవరపల్లి నీలాంబరం, బొల్లిముంత కృష్ణ, శ్రీకాంత్, నాగమణి, శ్రీదేవి పాల్గొన్నారు.


మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తెనాలి అర్బన్: నన్నపనేని వెంకట్రావు ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం ఇంజనీర్స్ డే వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ ఘంట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులంతా పారిశ్రామికరంగం వైపు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వీబీఎస్ అజయ్, కె.ఎస్. గురురాజ్, సిబ్బంది పాల్గొన్నారు.


ఇంటింటికీ సమరసత సేవ ఫౌండేషన్ ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తెనాలి టౌన్: సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో జరుగుతున్న ఇంటింటికీ ధర్మప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం యడ్ల లింగయ్య కాలనీ, ఇందిరానగర్‌లలో నిర్వహించారు. సభ్యులు ఇంటింటికీ వెళ్లి హిందూ ధర్మం గొప్పదనాన్ని తెలియజేస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమ శంకరరావు మాట్లాడుతూ హిందూ ధర్మం మానవులందరి సంక్షేమం కోరుకుటుందని తెలిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఆయన కార్యాలయంలో కలసి కరపత్రాల్ని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తెనాలి సబ్‌డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్‌కుమార్, ధర్మప్రచారక్ చంద్రసాయి, మహిళా కన్వీనర్లు కోనేటి అన్నపూర్ణ, కె.మాధురి, డి.దుర్గ, బాలాత్రిపుర సుందరి, నర్రా పద్మ పాల్గొన్నారు.

బాబా ఆశ్రమంలో పండ్లు, దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న నరేంద్ర రామానుజదాసస్వామి

తెనాలి టౌన్: పట్టణ గాంధీనగర్‌లోని షిర్డీ సాయి బాబా ఆశ్రమంలో శుక్రవారం ఎస్వీ యోగా సభ్యుడు చిట్టిమడుగుల భాస్కరరావు తల్లి రాఘవమ్మ వర్ధంతి పురస్కరించుకుని వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. రూరల్ మండలం ఖాజీపేటకు చెందిన సీహెచ్.సాంబయ్య స్మారక షరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరేంద్ర రామానుజ దాసస్వామి పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, యోగా సభ్యుడు సీహెచ్.భాస్కరరావు, యర్రంశెట్టి హనుమంతరావు, ఆశ్రమ నిర్వాహకులు సూర్యనారాయణ, సునీత, యోగా సభ్యులు పాల్గొన్నారు.